కల్లూరు ఆర్డీవోగా రాజేందర్

కలెక్టర్ గౌతమ్‌కు పూలమొక్క అందజేస్తున్న ఆర్డీవో

సత్తుపల్లి, ఏప్రిల్ 18: కల్లూరు ఆర్డీవోగా ఎల్ రాజేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్డీవో శ్రీనివాస్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఇన్ చార్జి ఆర్డీవోగా పనిచేశారు. నారాయణపేట నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) ఎన్నికల్లో భాగంగా రాజేందర్ కల్లూరుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసి పూలమొక్కను అందించారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవో..

మామిళ్లగూడెం, ఏప్రిల్ 18: కల్లూరు ఆర్డీవోగా నియమితులైన ఎల్.రాజేందర్ గౌడ్ గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఐడీవోసీలో కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసిన ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 18: లోక్‌సభ సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లాకు కేటాయించిన ఇద్దరు వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణ స్వామి, శంకర నంద్ మిశ్రాలు గురువారం ఖమ్మానికి చేరుకున్నారు. వ్యయ పరిశీలకులకు నూతన కలెక్టరేట్ కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ స్వాగతం పలికి పూలమొక్కలు అందించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

'హ్యాపీకిడ్స్' స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో గల హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో గురువారం గ్రాడ్యూయేషన్ డే వేడుకలు నిర్వహించారు. యూకేజీ, విద్యార్థులు ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీ, ఐదవ తరగతి విద్యార్థులను పై చదవులకు ప్రమోటు అవుతున్న నేపథ్యంలో పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దుర్గా, ప్రిన్సిపల్ ఉమారెడ్డి, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపెట వెంకటేశ్వర్లు, ప్రైవేట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరసా రమేశ్, టీచర్లు ఆశాజ్యోతి, కవిత, రాధిక, రాజేశ్వరి, కల్యాణి, శారద విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్సీ ఎమ్మెల్టీ ఫలితాల్లో 'రూరల్' విద్యార్థిని ప్రతిభ

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 18: వరంగల్ కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన బీఎస్సీ ఎమ్మెల్టీ ఫలితాల్లో ఖమ్మం రూరల్ మండల విద్యార్థిని ప్రతిభ చూపింది. నాయుడుపేట ఇందిరమ్మకాలనీకి చెందిన మద్దెల సాధిక.. ప్రాథమిక విద్యను మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కొత్తూరు (సీ)లో పూర్తి చేసింది. 6 నుంచి 10 తరగతులను ఖమ్మం రూరల్ కేజీబీవీలో అభ్యసించింది. ఇంటర్ ఎమ్మెల్టీని ఖమ్మం బాలికల కళాశాలలో పూర్తిచేసింది. ఇందులో 934/ 1000 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. అనంతరం వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో బీఎస్సీ ఎమ్మెల్టీ సీటు సాధించి మూడేళ్ల కోర్సును పూర్తి చేసింది. విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే పూర్తి చేసిన ఆమె.. గురువారం కాళోజీ యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలై ఉత్తమ ప్రతిభ చాటింది.

దివ్యాంగ విద్యార్థినికి ఆర్థిక సాయం

చింతకాని, ఏప్రిల్ 18: మండలంలోని చింతకాని ఉన్నత పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థి కల్పనకు ఆపరేషన్ వైద్య ఖర్చుల నిమిత్తం అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్ పుప్పాల పద్మావతి పుట్టిన రోజు సందర్భంగా గురువారం రూ.10వేల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, కాంప్లెక్స్ హెచ్ఎం బీవీ శర్మ, కార్యదర్శి షేక్ సైదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధిర పాస్టర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

మధిర, ఏప్రిల్ 18: పట్టణంలోని ఫిలడెల్ఫియా హోలి చర్చిలో గురువారం జరిగిన పాస్టర్ కార్యవర్గ సమావేశంలో మధిర మండల పాస్టర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాన్‌పీటర్, సెక్రటరీ జాషువా, వైస్‌ప్రెసిడెంట్ గద్దల ఏసును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత సన్మానించారు. కార్యక్రమంలో మొండితోక జయాకర్, 11వ వార్డు అధ్యక్షుడు గద్దల స్వామి, పాస్టర్లు జాషువా, ఏసురత్నం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'అబాకస్'లో 'త్రివేణి' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18: అబాకస్ పోటీల జూనియర్, సీనియర్ విభాగాల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని ఖమ్మం త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థుల్లో నిహాల్‌రాజు మొదటి బహుమతి, లాల్ రెండో బహుమతి సాధించినట్లు చెప్పారు. గణితం సులభంగా నేర్చుకోవడం కోసం అబాకస్ ఎంతో ఉపయోరంగా ఉంటుందనిఅన్నారు. కాగా, ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల బాధ్యులు గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు గురవారం అభినందించారు.

28 నుంచి ఖమ్మంలో టేబుల్ టెన్నిస్ పోటీలు

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 18: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్ రాయల సతీశ్, భరణి, ఇతర వైద్యులు గుర్రం నరేన్, ఎంజీవీ ప్రవీణ్ తెలిపారు. ఈ పోటీల పోస్టర్‌ను నగరంలోని టేబుల్ టెన్నిస్ స్టేడియంలో గురువారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పోటీలు పురుషులు, మహిళలు, బాలబాలికలు, క్యాడెట్ల విభాగాల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ట్రోఫీ, మెడల్స్, క్యాష్ ప్రైజ్ అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సాంబమూర్తిని 9848408335 నెంబరులో సంప్రదించాలని సూచించారు. డాక్టర్ యశ్మిత, కొండా శ్రీధర్, ఉపేందర్, శశికుమార్, జంగా కార్తీక్, ప్రవీణ్, పరిటాల చలపతి తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'నియమావళి'ని కచ్చితంగా పాటించాలి

- రాష్ట్ర సరిహద్దుల మీదుగా ప్రవేశించే వాహనాలను తనిఖీ చేయాలి
- రాత్రి 11 గంటలలోపు దుకాణాలను మూసివేయించాలి
- ప్రశాంతతకు భంగం కలిగించే హిస్టరీ షీట్లపై నిఘా: సీపీ

ఎన్నికల చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్న పోలీసులు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 18: ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలని ఖమ్మం సీపీ సునీల్‌దత్ ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం జిల్లాలో మోహరించిన కేంద్ర పోలీసు బలగాలతోపాటు స్థానిక పోలీసులు చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గురువారం నాటి తనిఖీల వివరాలు, ఇతర అంశాలను ఓ ప్రకటన ద్వారా వివరించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అంతరాష్ట్ర సరిహద్దులో పటిష్టమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లోనూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని, నగరం నుంచి వెళ్తున్న అన్ని వాహనాలనూ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు, ఇతరత్రా సొత్తును సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్ల కూడదని, పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు ఉంటే సంబంధిత పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో 15 ఎఫ్ఎస్‌టీ, 15 ఎస్ఎస్‌టీ, 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ బోర్డర్, 10 ఇంటర్ స్టేట్, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాటి ద్వారా 24x7 పటిష్ట నిఘా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తనిఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. రాత్రి 10:30 నుంచి 11గంటల్లోపు కచ్చితంగా వ్యాపార దుకాణాలు, వాణిజ్య సముదాయాలను మూసివేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించడం, రాత్రి వేళల్లో సమయానికి మించి షాపులు తెరిచి ఉంచడం, పుట్టిన రోజు వేడుకల పేరుతో నడి రోడ్లపై వాహనాలు అడ్డం పెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించడం వంటివి చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఇప్పటికే పోలీస్ అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. రాత్రివేళలో వీధుల్లో సంచరించడం, ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఘర్షణలకు దిగడం, ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే వారి హిస్టరీ షీట్లపై నిరంతరం నిఘా పెట్టాలని ఆదేశించారు.

ముత్తారం రాములోరికి పట్టాభిషేకం

పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

ముదిగొండ, ఏప్రిల్ 18: మండలంలోని ముత్తారం గ్రామంలో గల సీతారామ స్వామి పట్టాభిషేకాన్ని గురువారం అర్చకులు నిర్వహించారు. స్వామి వారి వార్షిక తిరుపక్ష బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణం, మరుసటి రోజు పట్టాభిషేకం నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్నది. వేద పండితులు బొర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసా చార్యులు మరియు శిష్య బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణ నడుమ పట్టాభిషేకమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించారు.

సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కూసుమంచి, ఏప్రిల్ 18: మండలంలోని నర్సింహులగూడెంలో సీతారామచంద్ర స్వామి ఉత్సవ విహాలను గురువారం అర్చకులు, భక్తులు ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు బండి పాటను బిజిగ సుధాకర్,ఉషా దంపతులు రూ.15 వేలకు పాట పాడి ఊరేగించారు. కార్యక్రమంలో డేగల మల్సూర్, శీలం శంకర్, బోయిన కృష్ణ, సాయి, భద్రం, సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నిర్వహణలో.. సూక్ష్మ పరిశీలకుల పాత్ర ప్రధానం

- ఎక్కడైనా అవాంతరాలు ఎదురైతే ఆర్‌వో దృష్టికి తీసుకెళ్లాలి
- మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకుడు శ్రీరామ్

మాట్లాడుతున్న జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకుడు శ్రీరామ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 18: లోక్‌సభ సాధారణ ఎన్నికల విధుల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత ప్రధానమని ఖమ్మం లోక్‌భ ఎన్నికల జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకుడు, జిల్లా ఉపాధి కల్పన అధికారి కే.శ్రీరామ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో వారు కళ్లు, చెవుల వంటి వారని అన్నారు. ఖమ్మం లోక్‌సభ స్థానానికి జరిగే ఎన్నికల నిమిత్తం 270 మంది సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్లు)ను నియమించారు. ఈ ఎన్నికల విధుల నిర్వహణపై ఖమ్మం ఐడీవోసీలో గురువారం వారికి శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డితో కలిసి శ్రీరామ్ మాట్లాడారు. సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంతరాలకు చోటులేకుండా ఎన్నికల విధులను నిర్వహించాలని సూచించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ ప్రక్రియను గమనించాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సూక్ష్మ పరిశీలకుల విధుల గురించి అవగాహన చేశారు. కలెక్టరేట్ పర్యవేక్షకుడు మదన్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో మజ్జిగ వితరణ

ఖమ్మం, ఏప్రిల్ 18: ఖమ్మం గాంధీచౌక్ వరప్రధాత షిర్డీ సాయి మందిర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర వచ్చి ఏర్పాటు చేసిన మజ్జిగ వితరణ కేంద్రాన్ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుమారుడు నిఖిల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నిఖిల్‌ను ఆలయ కమిటీ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి బాబా ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో బాటసారుల కోసం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్.. ఇప్పటి నుంచి 50 రోజులపాటు కొనసాగుతుందని అన్నారు. ప్రతి రోజూ 1,200 మందికి మజ్జిగ అందించేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. తొలిరోజు మజ్జిగను వేముల పల్లి వెంకటేశ్వరరావు – సామ్రాజలక్ష్మి సమకూర్చారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వేంసూరు, ఏప్రిల్ 18: మండలంలోని మండలపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రమేశ్, ఏపీవో కోటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రదేశాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పని ప్రాంతంలో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలతో పాటు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పని ప్రదేశంలో కూలీలు అందరికీ అందజేయడం జరుగుతుందన్నారు. వారి వెంట టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

జాతీయ రహదారిపై ఉపాధి కూలీల నిరసన

పెనుబల్లి, ఏప్రిల్ 16: ఉపాధి హామీ పథకంలో రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ మండలంలోని టేకులపల్లి జాతీయ రహదారిపై ఆ గ్రామ ఉపాధి కూలీలు, రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు గురువారం నిరసన చేపట్టారు. ఉపాధి పనుల మట్టి తోలకాలకు అనుమతులు కావాలని ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు ఆపి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. కూలీ వేతనాలు సరిగా పడడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దీంతో రహదారిపై కిలోమీటరన్నర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసుల జోక్యంతో ఆందోళనకారులు నిరసన విరమించారు.

మనోహర్‌కు ఆర్‌జేసీ, కూరాకుల పరామర్శ

ఖమ్మం, ఏప్రిల్ 18: అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ఖమ్మానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రామిశెట్టి మనోహర్‌ను బీఆర్ఎస్ నాయకుడు ఆర్‌జేసీ కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం గురువారం పరామర్శించారు. హైదరాబాద్‌లో అతడి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

సుబాబుల్ తోట దగ్ధంపై కేసు నమోదు

రఘునాథపాలెం, ఏప్రిల్ 18: సుబాబుల్ తోట దగ్ధమైన ఘటనపై రఘునాథపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. ఖమ్మం బల్లేపల్లికి చెందిన చింతపల్లి నారాయణకు చిమ్మపూడి రెవెన్యూలో 8 ఎకరాల సుబాబుల్ తోట ఉంది. తన చేను పక్క పొలానికి చెందిన కటకం శ్రీను అనే రైతు అతడి మిర్చి తోటలో చెత్తను కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోలేదు. దీంతో అక్కడి నుంచి మంటలు వ్యాపించి నారాయణకు చెందిన సుబాబుల్ తోట పూర్తిగా కాలిపోయింది. దీంతో బాధిత రైతు పోలీసులను ఆశ్రయించాడు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

సత్తుపల్లి, ఏప్రిల్ 18: పట్టణానికి చెందిన ఓ వృద్ధురాలు అనాథగా ఉండడంతో విషయం తెలుసుకున్న యువ సేవాసమితి ఆధ్వర్యంలో గాయత్రి పెయింట్స్ నిర్వాహకుడు శివ సహకారంతో గురువారం నిత్యావసర సరుకులు, కూరగాయలు, 25 కిలోల బియ్యం తదితర వస్తువులను మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ అందజేశారు.

కాంగ్రెస్ హయాంలోనే కరెంటు కోతలు

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే కరెంట్ కోతలు ఉంటాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన సత్తుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరాను చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే విద్యుత్ కోతలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు.

మోటారు సైకిళ్లపై గంజాయి రవాణా

గంజాయితో పట్టుపడిన నిందితులతో సీఐ రాజిరెడ్డి

ఖమ్మం రూరల్/ముదిగొండ, ఏప్రిల్ 18: మోటారు సైకిళ్లపై గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్న ఘటన ముదిగొండ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి కథనం ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీపీ ఆదేశాలకు మేరకు ముదిగొండ ఎస్సై నరేశ్ తన సిబ్బందితో కలిసి ముదిగొండలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో రెండు మోటార్ సైకిళ్లపై ఏడుగురు వ్యక్తులు ప్రయాణిస్తూ ఆ వాహనాల పెట్రోల్ ట్యాంకులపై రెండు బస్తా సంచులను తీసుకెళ్తున్నారు. పోలీసులు వారిని పట్టుకొని పరిశీలించగా ఆ బస్తాల్లో గంజాయి లభ్యమైంది. పట్టుబడిన వారిలో సువర్ణపురానికి చెందిన కొట్టె మధు, తోట నవీన్, ధంసలాపురానికి చెందిన తోట వినయ్‌కుమార్, కారేపల్లికి చెందిన మహ్మద్ ఖాజామెయినుద్దీన్‌తోపాటు ముదిగొండ మండలానికి చెందిన మరో ముగ్గురు మైనర్లు ఉన్నారు. ఈ నిందితుల నుంచి రూ.1.50 లక్షల విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

బోనకల్లు, ఏప్రిల్ 18: వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల వైద్యాధికారి స్రవంతి ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని చిన్నబీరవల్లి, నారాయణపురం, చొప్పకట్లపాలెం, ముష్టికుంట్ల, కోనారెడ్డిపాలెం గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి స్రవంతి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వడదెబ్బ లక్షణాలు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నబీరవల్లి గ్రామ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్, ఎంపీవో శాస్త్రీ, సీహెచ్‌వో శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ దానయ్య, రాజ్యలక్ష్మి, స్వర్ణమార్త, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ

కారేపల్లి, ఏప్రిల్ 18: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు కారేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో కారేపల్లి–కామేపల్లి సీడీపీవో కే దయామణి గురువారం ఓర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను మధ్యాహ్నం 12 గంటల వరకు నడుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు విజయకుమారి, శనగబేబి పాల్గొన్నారు.

'ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి'

ఖమ్మంఎడ్యుకేషన్, ఏప్రిల్ 18: పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజాషా పిలుపునిచ్చారు. విద్యా పరిరక్షణ సంస్థ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కాకతీయ యూనివర్సిటీ సబ్ క్యాంపస్‌లో సంఘం అధ్యక్షుడు విజయ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు మనోహర్‌రాజు, నాగిరెడ్డి, నామాల ఆజాద్, రామకృష్ణ, వెంకటేశ్, మస్తాన్, సురేశ్, రమేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రావుకు బీఆర్ఎస్ నాయకుల నివాళి

ఎర్రుపాలెం, ఏప్రిల్18: ఎర్రుపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దేవరకొండ రవికుమార్ తమ్ముడు ప్రభాకర్ రావు గురువారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, కామిశెట్టి పవన్‌కుమార్, ఆకుల నాగేశ్వరరావు, వెంకటరత్నం, రామకృష్ణ, గంధం శ్రీనివాసరావు ఉన్నారు.

రాజసాయి మందిరంలో అన్నదానం

పెనుబల్లి, ఏప్రిల్18: మండలంలోని వీఎం బంజరలో గల శ్రీరాజసాయి మందిరంలో పలువురు దాతలు అందించిన విరాళాలతో గురువారం అన్నదానం నిర్వహించారు. ప్రతి గురువారం ఎవరైనా అన్నదానం చేయదల్చిన వారు ముందుగా ఆలయ కమిటీ సభ్యులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో జన్నారెడ్డి విజయ, భీమిరెడ్డి శ్యామల, శ్రీనివాసరావు, నర్సింహారావు, వెంకటేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఏబీవీపీ దుండగుల దాడికి ఖండన

వైరాటౌన్, ఏప్రిల్ 18: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఏబీవీపీ దుండగులు బుధవారం అర్ధరాత్రి జరిపిన దాడిని ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. గురువారం వైరాలోని బోడేపూడి భవన్‌లో జిల్లా కమిటీ సభ్యుడు హేమంత్ అధ్యక్షతన జరిగిన ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వైరా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల నాగరాజు, కోటా ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి భయంతో ఏబీవీపీ నాయకులు మానసికంగా భౌతికంగా దాడులు చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలను మానుకోకపోతే వచ్చే ఎన్నికల్లో వామపక్ష విద్యార్థులే ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దాడులపై విద్యార్థి యువజన విద్యావంతులు, మేధావులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, హేమంత్, జస్వంత్, గణేశ్, చరణ